క్లుప్తంగా

లైబ్రేరియన్లకు సన్మానం



శకుంతల, రమణలను సన్మానిస్తున్న లైబ్రేరియన్లు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్స్ డే ను ఘనంగా జరిపారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న లైబ్రేరియన్లు దిమిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిమిలి, మునగపాక గ్రంథాలయ అధికారులు ఎస్.శకుంతల, ఎల్.వి.రమణలను లైబ్రేరియన్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిట్టైర్డు హెచ్ఎం శేఖరమంత్రి నర్సింగరావు(తాతాజీ), నూకినాయుడు, లైబ్రేరియన్లు ఆనంద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలి



జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకోవాలని మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దాసరి గౌరీలక్ష్మి అప్పారావు పిలుపునిచ్చారు. నాగవరం సచివాలయం వద్ద శనివారం జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జెండా ఎగురవేసేలా చూడాలన్నారు. పోస్టాఫీస్‌లలో రూ.25కు జెండాలు విక్రయిస్తున్నారన్నారు. అలాగే స్వాతంత్య్ర సమరయోధులకు వందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి రాజు

రాంబిల్లి : వాడనర్సాపురం, లోవపాలెం , వెంకయ్యపాలెం గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ గ్రామాల్లో విష జ్వరాలతో పలువురు బాధపడుతుండడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు రాంబిల్లి పీహెచ్‌సీ డాక్టర్ అమృతసాయి వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలను జిల్లా మలేరియా అధికారి ఎస్.రాజు పరిశీలించారు. పలువురు నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ పరీక్షకు పంపినట్టు అమృతసాయి తెలిపారు.

ముమ్మరంగా దమ్ము పనులు



నారాయణపురం సమీపంలో ట్రాక్టర్ సాయంతో దమ్ము పనులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో దమ్ము పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు దమ్ము పనులకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట ఎరువులను రాయితీపై అందజేశారు. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట వేసిన రైతులు సైతం దమ్ము పనులు చేస్తున్నారు. పచ్చిరొట్టను దమ్ము చేయడం ద్వారా నేల సారవంతంగా మారి వరి పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చే అవకాశాలుంటాయని రైతులు తెలిపారు.


కంటి వైద్య శిబిరం వాయిదా

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 13న బ్రాండిక్స్‌లో నిర్వహించాల్సిన ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను వాయిదా వేస్తున్నట్టు బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేసిన ఈ శిబిరాలను ఈ నెల 27న నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటి వరకూ 111 కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 59 వేల మంది నేత్రాలకు సంబంధించిన వైద్య సేవలందించినట్టు పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో డిజిటల్ పాఠాలు

- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు
- ఆసక్తికరంగా వింటున్న విద్యార్థులు
- బ్లాక్‌బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులు

దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ విద్యారంగంలో పూర్తిస్థాయి సంస్కరణలకు నాంది పలికిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టిస్తోంది. ఇందులో భాగంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పి)లు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు సరికొత్త విద్యాబోధన అందుబాటులోనికి తెస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి.



కొత్తపేట హైస్కూల్లో ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

యలమంచిలి : కార్పొరేట్ పాఠశాలలలో సైతం లేని విధంగా సర్కారీ బడుల్లో దశల వారీగా డిజిటల్ బోధనను అందించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ నూతన విధానం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 1 నుండి 5 వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 3 నుండి 10 వ తరగతి వరకు స్మార్ట్ టీవీలతో పాటు ఐఎఫ్‌పీల ద్వారా ఉపాధ్యాయులు బోధించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేసి అత్యాధునిక బోధనను అందిస్తున్నారు.

బ్లాక్ బోర్డులకు స్వస్తి

డిజిటల్ బోధన పూర్తిగా అందుబాటులోనికి వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చాక్ పీసులకు కాలం చెల్లనుంది. ఇప్పటికే యలమంచిలి పట్టణం, మండలంలోని కొత్తపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్టేషన్ రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,తులసీనగర్ బాలికల ఉన్నత పాఠశాల, సోమలింగపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంపపాలెం, ఏటికొప్పాక, పురుషోత్తపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదపల్లి , పేటబయ్యవరం యూపీ పాఠశాలలతోపాటు మరి కొన్ని పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశారు.

మండలంలో ఇలా...

ప్రాథమిక పాఠశాలలు-37
ప్రాథమికోన్నత పాఠశాలలు-3
ఉన్నత పాఠశాలలు-10
రెసిడెన్షియల్ పాఠశాలలు-1
మొత్తం పాఠశాలలు-51
ఇప్పటివరకు ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు-8
ఇప్పటివరకు ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీలు-44

ఉపాధ్యాయులకు శిక్షణ

స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు వినియోగంపై ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణను ఇచ్చారు. ఇంటర్నెట్ అనుసంధానంతో వున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డును ఏ విధంగా ఉపయోగించనున్నదీ వివరించారు. కొత్త విధానంలో ఒక క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలు చూపించవచ్చు. లెక్కలు, సైన్సు, పాఠ్యాంశాల బోధన సమయంలో కొన్ని బొమ్మలు వేయాల్సి ఉంటుంది. డిజిటల్ విధానంలో చేతితో బొమ్మలు వేయాల్సిన పని ఉండదు. గతంలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు సందేహాలుంటే వెంటనే దానిని బోర్డుపై ప్రదర్శించి సందేహాలు నివృత్తి చేయవచ్చు.

విప్లవాత్మక మార్పు



ఐఎఫ్‌పీ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలను సులభతరంగా వివరించవచ్చు. దీనికి తోడు దృశ్య, శ్రవణంతో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థికి ఎక్కువకాలం గుర్తుండే అవకాశం ఉంది. మ్యాపులు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను ఫొటోలతో చూపించడానికి వీలవుతుంది. దేశ చరిత్రలోనే విద్యారంగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా చెప్పవచ్చు.

-ఎస్.సూర్యప్రకాష్, ఇంగ్లిష్ టీచర్, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యలమంచిలి

నూతన ఒరవడి



విద్యావిధానంలో ఇదొక నూతన ఒరవడి. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులకు సమగ్రమైన విద్యా బోధన జరిపేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానంతో భవిష్యత్తులో మంచి ఫలితాలొస్తాయి. డిజిటల్ విద్యా విధానం ద్వారా విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు వినడంతో పాటు మరిన్ని నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

-కె.టి.వి.ఎస్ చక్రవర్తి, హెచ్ఎం, కొత్తపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యలమంచిలి

సులభంగా అర్థమవుతున్నాయి



స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా పాఠాలు వినడం కొత్తగా ఉంది. ఇలా చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. వీడియోలు, కదిలే బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తుండడంతో ఎక్కువకాలం గుర్తుంటున్నాయి. ఈ విధానం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉత్సాహం పెరిగింది. డిజిటల్ విధానం మాకందరికీ చదువుపై ఆసక్తి పెరిగేలా చేస్తోంది.

-వి.ఫోబేరాణి, 10వ తరగతి విద్యార్థిని, కొత్తపేట, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, యలమంచిలి

నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం



గుంటపల్లి గ్రామంలో నాభూమి నాదేశం కార్యక్రమం నిర్వహించిన అధికారులు

పాయకరావుపేట : నా భూమి – నా దేశం అనే కార్యక్రమాలు మండలంలో అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. గుంటపల్లి గ్రామంలో శనివారం అమర వీరుల జ్ఞాపకార్థం శిలాఫలకం ఏర్పాటు చేశారు. నేల తల్లికి నమస్కారం, అమర వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దాం అని నినదించారు. చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఈవోఆర్‌డీ వైఎస‌త్యనారాయణ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపమాకలో వెయ్యిమందికి అన్నదానం



ఉపమాకలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నక్కపల్లి : అధిక శ్రావణమాసం బహుళ ఏకాదశి శనివారం కావడంతో ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యార్చనలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. అనంతరం దాతల విరాళాలతో స్వామివారి సన్నిధిలో సుమారు వెయ్యి మందికి అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. నక్కపల్లి సీఐ అప్పన్న దంపతులు శనివారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



తోటాడ హైస్కూల్‌లో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

మునగపాక : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, ఖోఖో వంటి ఆటలను ఆడిస్తున్నారు. ఎవరికి ఏ క్రీడపై ఆసక్తి ఉందో వాటిని ప్రోత్సహిస్తున్నారు. ఆగస్టు 15వ తేదీన విజేతలకు బహుమతులు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

శివారు గ్రామాల్లో పారిశుధ్య లోపం



రామన్నపాలెంలో మురికికూపంతో అధ్వానంగా ఉన్న వీధి రోడ్డు

కోటవురట్ల: శివారు గ్రామాలపై నిర్లక్ష్యపు నీడ పరుచుకుంది. తమ గ్రామం వైపు అధికారులు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పలు గ్రామాల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. రాజుపేట శివారు రామన్నపాలెంలో సీసీ రోడ్లు లేకపోవడంతో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. డ్రైనేజీలు కూడా లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరు మట్టిరోడ్లపై చేరి మురుగుకూపాలుగా తయారయ్యాయి. దోమలు వ్యాప్తి చెంది రోగాలు ముసురుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పీలా గోవింద సత్యనారాయణతో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: మండలంలో తుమ్మపాల కొత్తపేట వీధిలో గల విఘ్నేశ్వరస్వామి ఆలయ 2వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్వామివారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్రి బాబీ, ఆళ్ల రామచంద్రరావు, శందిన చినబాబు, ముత్తుర్తి మహేష్, పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల జాబితాల సవరణ



నక్కపల్లిలో ఓటర్ల జాబితా సర్వేచేస్తున్న ఎంపీడీవో, డీటీలు

నక్కపల్లి : మండలంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. శనివారం ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ నీరజలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాలను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారి వివరాలతో పాటు, మరణించిన వారు, వలస పోయిన వారి వివరాలు సేకరించారు. బూత్‌ల వారీగా ఇళ్లకు వెళ్లి ఆ ఇంట్లో ఎంతమంది నివసిస్తున్నారు..ఎంతమందికి ఓటు హక్కు ఉంది అనే వివరాలు తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా పరిశీలనకు వచ్చిన బీఎల్‌వోలకు సహకరించాలని వారు ఓటర్లకు సూచించారు.

37వ రోజుకు చేరిన రిలే దీక్షలు

కోటవురట్ల : అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష 37వ రోజు కొనసాగింది. తమ గ్రామానికి రహదారి నిర్మించాలని, గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజనులు నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు గిరిజనులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్నారు. అధికారులు స్పందించేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని గిరిజనులు తెలిపారు.


రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొలిశెట్టి గోవిందు తదితరులు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కీర్తి శేషులు కర్రి గాంధీ జయంతి సందర్భంగా స్థానిక యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 80 యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. గాజువాక అమ్మ బ్లడ్ సేకరణ సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి, మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు సత్తిబాబు సహాయ సహకారాలు అందించారు.

ఆకట్టుకున్న భక్తి పాటల కచేరీ



భక్తిగీతాలు ఆలపిస్తున్న విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించి భక్తి పాటల కచేరీ ఆకట్టుకుంది. అధిక శ్రావణమాసంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించి ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కె.విష్ణుమూర్తి పలు భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు గీతా ప్రైవేటు ఆస్పత్రిలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శనివారం తెలిపారు. డాక్టర్ వి.సంపత్ వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మిద్దె పంటలతో అధిక ఆదాయం

అనకాపల్లిటౌన్: మిద్దెలు, మేడలపై పంటల పండించడం ద్వారా అధిక ఆదాయం సమకూరుతుందని గాయత్రీ ఎకోప్రొడక్ట్స్ అధినేత రావూరి అనిత అన్నారు. గవరపాలెం వంశీఫంక్షన్ హాలులో గ్రీన్‌క్లబ్, రూఫ్‌గార్డెనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మేడలపై కూరగాయలు, తోటల పెంపకంపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పంటల సాగు ద్వారా అటు కాలుష్య నియంత్రణతోపాటు ఆదాయం సమకూరుతుందన్నారు. అంతకుముందు 60 రకాల టమాటా, 30 వంగ విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, విజయనగరానికి చెందిన రైతునేస్తం అవార్డు గ్రహీత ఆదిలక్ష్మి, విశ్రాంతి అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్, గార్డెనర్స్ సభ్యులు నీలవేణి, ఆశాలత పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



గుంటపల్లిలో గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉందని, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుంటపల్లి గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న అమ్మ ఒడి, రైతు భరోసా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక , వాహన మిత్ర, డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ తదితర పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదా అని అర్హులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలకు పక్కా గృహాలు నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. స్థలాలు లేని పేదలు ఉంటే దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, మధ్యవర్తులు, దళారీలు లేకుండా స్వయంగా ప్రభుత్వ సిబ్బంది అర్హులకు పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఐసరపు పార్వతీ తాతారావు, ఎంపీటీసీ పల్యాల శ్రీరామవర లక్ష్మి, నామవరం రామాలయం చైర్మన్ గదుల లోవ రాజు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ నాయకులు పల్యాల లక్ష్మణరావు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొంకిపూడి రామకృష్ణ, బొడ్డా శ్రీదేవి, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, పంచాయతీరాజ్, హౌసింగ్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యుఎస్ మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ వేగవంతం చేయాలి



పి.ధర్మవరం గ్రామంలో పర్యటిస్తున్న నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి

ఎస్.రాయవరం : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని ఉండాలని పాయకరావుపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి అన్నారు. ఓటరు జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా శనివారం ఆమె పి.ధర్మవరం గ్రామంలో పర్యటించారు. సుమారు 20 గడపలు తిరిగి ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించారు. కుటుంబంలో యువకులు పనుల నిమిత్తం దూరంగా వెళ్లిన వారి వివరాలు తెలుసుకుని పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో అన్ని గ్రామాల్లోనూ ఓటరు జాబితా స్వచ్ఛీకరణ వేగవంతంగా చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఆగస్టు 21 నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



బహుమతులతో విద్యార్థులు

యలమంచిలి : ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకలు శనివారం యలమంచిలి ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. 88 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు వక్తృత్వ పోటీలు, వ్యక్తిత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు బాబ్జి, మాజీ ఏఐఎస్ఎఫ్ సన్యాసిరావుతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ ఆది నుంచి ఉద్యమాలు చేపట్టిన ఘనత ఒక ఏఐఎస్ఎఫ్‌దేనని, దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి ఏఐఎస్ఎఫ్ పాటుపడుతుంది అని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు హరికృష్ణ నాయుడు, వరహాలు అభి పాల్గొన్నారు.

ఓటరు సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి



మూలపేటలో ఓటరు సర్వే పరిశీలిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మూలపేటలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో సవరణలు తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కొత్తగా ఓటర్లను చేర్పించాలన్నారు. సర్వే పక్షపాతం లేకుండా చేయాలన్నారు. ఈ నెల 22 లోగా సర్వే పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు జాబితాలు పరిశీలించి తేడాలుంటే వాటిని సరి చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక పంచాయతీ కార్యదర్శి శివ, పలు రాజకీయ పార్టీల నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి



ఉమ్మలాడలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మురళీధర్

మునగపాక : ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేయించే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మురళీధర్ కోరారు. ఉమ్మలాడ గ్రామంలో శనివారం ఆయన మిషన్ ఇంద్ర ధనస్సు టీకాల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి వారిని వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అక్టోబర్ నెల వరకు మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీహెచ్ఈవో సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ , ఆహిన్ అంజుం, ఏఎన్ఎం మరియారత్నం, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు కావేరి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి పీఎం సహాయ నిధి



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలు ఏడువాక సత్యవతికి పీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎంపీ బి.వి.సత్యవతి తన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ఈ చెక్కును అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో అందించి చికిత్స చేయించుకోవాలని సూచించారు.